పెళ్లి అంటే

వారణాశి రామలక్ష్మీనరసింహంగారు

౧

సువర్ణ డిప్యూటీ కలెక్టరుగారికూతురు. చాలా చురుకైంది. సార్థకనామ. హృదయనైర్మల్యం, శరీర సౌందర్యం, మేలిమిగుణాలు ఇట్లాంటివి అలంకారానికి అర్థస్ఫూర్తినిస్తున్నాయి. చుట్టుపక్కల యిళ్ళ వాళ్ళు "సువర్ణ చూడు ఎంతమంచిదో" అని తమ పిల్లలకి ఆదర్శంగాచూపుతూండేవాళ్ళు.

సువర్ణకి ఐదోయేటే పెళ్ళయింది. చక్కహో బాజాలొచ్చేయి, చుట్టాలంతావొచ్చేరు ఇంకా రకరకాల అప్పచ్చులు చేసుకున్నారు. ఇవన్నీ ఆపిల్లకొక పెద్ద పండగలాగా అర్థంఅయాయి. ఇంతే.

కూతురిపెళ్ళయిన కొద్దిరోజుల్లోనే డిప్యూటీ కలెక్టరుగారికి తమ వియ్యంకుడుగారివూరు బదిలీ అయింది. అక్కడ అల్లుడు తరచు తమ యింటికొస్తూండేవాడు. డిప్యూటీకలెక్టరుగారు సువర్ణతో అతను తనకి బావవుతాడని చెప్పేరు. అంతచిన్నపిల్లకి మొగుడూపెళ్ళాం ఇట్లాంటిమాటలుచెప్పి అవసరంలేని సిగ్గుతెప్పించి అర్థంకాని గొడవలోముంచటం ఆయనకిష్టంలేదు. బావ తనకి భర్తగా అర్థంఅయేలోగా ఏదోఒక సంబంధంవుంచితీరాలని ఇద్దర్నీ స్నేహితుల్ని చేశారు. యుక్తవయస్సురాగానే యిద్దరినీ ఒకరికొకరిని తెలుపుదాంఅని ఉద్దేశ్యం. ఈఆశయంకారణంగా బావతో సువర్ణని చనువుగా ఆడుకోనిచ్చేవారు.

సువర్ణకి బావదగ్గిర అతిచనువు. బావయింట్లోకి రాగానే 'బావాబావాపన్నీరుబావనిపట్టుకుతన్నేరు' అన్నపాటతో ఆహ్వానం. తరవాత ఆటలుపాటలూ, అప్పుడప్పుడు చదువుకునేవాళ్ళుగూడాను. అంటే బావ చదువుచెప్పేవాడన్నమాట.

౨

ఒకరోజున సువర్ణబడినించి వచ్చింది. అప్పటికే నాన్నగారు ఆఫీసునుంచివచ్చేరు. కాసేపటికి బావ కూడా వొచ్చేడు. అప్పుడు మొహం యింతపొడుగు చేసి సువర్ణఅంది, "నాన్నా! నాన్నా! బావటా, మరే, నాకు మొగుడవుతాట్ట! మొగుడూగిగుడూను, బళ్లో అమ్మన్న, చిట్టీ, సుందరం అంతా 'ఒకమ్మాయి మొగుడుదగ్గిర చదువుకుంటోంది' అని వుడికిస్తున్నారు నాన్నా. నేనివ్వాళనించీ బావసావాసమే వుండను అట్లాఅయితే."

"వాళ్ళకేం తెలుసు వాళ్ళతలకాయ. మొగుడేమిటి నాకు బావవుతాడు అనిచెప్పు. ఉడికిలటం ఎందుకూ ఉడికిలినకొద్దీ మరీవుడికిలిస్తారు."

ఇంతలోనే అమ్మ ఇంట్లోంచి పనివాళ్లా అక్కడికొచ్చి "ఏం, అంటే యేమే నీదేంపోయింది. అవును గనకే అన్నారు. మొగుడైతేనేం ఇంతలోనే ఆడుకోవొచ్చు మరేంఫరవాలా."

"చూశావు నాన్నా! అవునుగనకే అన్నారుటా! అమ్మ అంటోంది" అని కోపంవొచ్చి కొంచంనీళ్ళుకార్చింది అమాయికపు కళ్ళవెంట.

"ఏమిటంట అదినీకు ఊఁచెప్పుతూన్న కొద్దీను. సువర్ణం! నీకెందుకు నువ్వువెళ్లి బావతో ఆడుకో అమ్మా."

సువర్ణ ఆడుకోనన్నది. కాసేపుండి బావ వెళ్లిపోయాడు.

... ...

చీకటిపడ్డది. అంతా అన్నాలుతిన్నారు. సువర్ణ భోంచేసిన కాస్సేపటిలోనే పడుకుని నిద్రపోయింది.

"నీకు చెప్రతూన్న కొద్దీ ఏమిటది. ఎందుకూ దానికి మొగుడూ సింగినాదం ఇట్లాంటివేవీ చెప్పొద్దే అంటేను."

"ఏమిటండీ ఆమాత్రం అన్నా తెలియక్కర్లా, దాండుంప తెగిపోయినచెర. ఇహ యిట్లాఅయితే పెద్దదయాక అతనంటేయేమన్నా లక్ష్యం వుంటుందీ. ఆమాత్రంచెప్పకపోతే యెల్లా? అదుపూ ఆజ్ఞాఅన్నా వుండాలా అక్కర్లేదా?"

"ఇప్పుడుచెప్పితే మాత్రం యేడుస్తుందా యేమిటి అదుపు. మాఅమ్మచస్తుంది అదుండగానే చెయ్యాండి పెళ్లిఅని గోలచేసి పోరుబెడితే నీపోరు పడలేక చేశాను. లేకపోతే కూనకి దానికి పెళ్ళేమిటి. చేశాం గదా పోనీ సమర్థించుకుందాం అంటే నీనోటికి తాళం లేదాయె."

"అయ్యో తాళంలేకేం ఇదంతా తాళం వెయ్యటమే. అయినా నాకెందుకొచ్చింది. మీయిష్టం వొచ్చినట్టు చేసుకోండి."

3

"ఒకమ్మాయి మొగుడిదగ్గిర చదువుకుంటోంది" అన్నారు చిట్టీవాళ్ళూ.

"మొగుడేమిటీ బావంటేను. ఈసారన్నా రాఅంటే పంతులమ్మగారితో చెప్పకపోతే అప్పుడనండి."

ఇది బడివసారాలో జరిగింది. సువర్ణ ఆమాటలంటూ వుండగా పంతులమ్మగారట్లా వొచ్చేరు. అంచాత చిట్టీవాళ్ళకి వాళ్ళనేడిపించేందుకు తావు దొరికింది కాదు. ఊరుకున్నారు.

. . . .

మధ్యాహ్నం. అంతాబడికొచ్చేరు చిట్టీవాళ్ళూ, సువర్ణాఅందరూను. సువర్ణ వాళ్ళవంక చూస్తూ ఆశ్చర్యం భయంకలిపి అంది "చిట్టీ! నీ మెళ్ళో గొలుసేమైందే? పారేసుకున్నావా?"

"లా. వూళ్ళోదొంగల భయంగావుందిట అందుకని మాఅమ్మ తీసిదాచేసింది. ఎవళ్ళమ్మాయినో ఎత్తుకుపోయినగలు తీసుకుని వూరుబయట వదిలిపెట్టి వెళ్ళారుటగూడాను"

"అమ్మయ్యో! నగలకోసం పిల్లల్నెత్తుకుపోవడమా. నేను నాదండతీసి జేబులో దాచేసుకుంటాను యింటికెళ్లేప్పుడు."

"ఏదండ!!"

"ఇదీ"అని మంగళసూత్రం చూపించింది.

"ఛీఛీ! అదేమిటె మంగళసూత్రాన్ని?"

"మంగళసూత్రంఏమిటీ? దండని చూసి దానికోసం నన్నుకూడా యెత్తుకుపోతారేమో దొంగలని భయం చేత దాచుకుంటానన్నాను."

"అది సరేలే. మరి మంగళసూత్రాన్ని తియ్యొచ్చా?"

. . . .

సాయంకాలం. సువర్ణ బడినించి వచ్చింది. వచ్చేరావటంతోటే అమ్మదగ్గిరకి వెళ్లింది. అమ్మ లోపలి సావిట్లోకూర్చుని జడవేసుకుంటూ పక్కింటావిడతో మాట్లాడుతోంది.

"అమ్మా! యీకాసులదండ తీసెయ్యావ్. దొంగలున్నారు వూళ్ళో, చిట్టిచెప్పింది. వాళ్ళమ్మ అందుకని తన గొలుసుతీసి దాచేసిందని."

అమ్మ వినిపించుకోలా.

"ఏమే అమ్మా! తియ్యవులే"

అమ్మ వినిపించుకోనేలేదు.

ఇంతలోనే నాన్నగారు వచ్చేరు ఆఫీసునించి. సువర్ణ ఆయనదగ్గిరకువెళ్ళి "నాన్న! ఈదండతీసి దాచిపెట్టమనవు అమ్మని."

ఆయనేదో ఆఫీసుసంబంధపు ఆలోచనలో పరధ్యానంగాఉండి "అమ్మనడుగుపో"అన్నారు. సువర్ణ అమ్మదగ్గిరకొచ్చి మళ్ళీ గోలచేసింది.

"ఏమిటే మాట వినిపించుకోనీవేం. కాస్సేపుండు. ఒకటేమాయగోల"అని కసురుకున్నది అమ్మ.

సువర్ణ తనపుస్తకాలు దాచుకుని కాళ్ళూచేతులూ కడుక్కుని మళ్ళీ అమ్మదగ్గిరకు వెళ్లింది. సువర్ణ కనపడడంతోటే "మాటాచోరనియ్యావ్ మనుష్నిచోరనియ్యావ్. చెప్పు. ఏమిటే నీగోల?"అంది అమ్మ.

"కాదే అమ్మా! మరీ వూళ్ళోదొంగలున్నారుటే. నగలకోసం పిల్లల్నెత్తుకుపోతున్నారుట. చిట్టితన మెళ్ళోగొలుసుతీసి వాళ్ళమ్మచేత దాయించుకుంది. నాదండకూడా దాచెయ్యి. నాకుభయంవేస్తోంది బడికెళ్ళడానికి" అంటూ తనమంగళసూత్రాన్ని వూడదీసింది.

"ఛీ! పాడుపిల్లా. మంగళసూత్రం తీస్తున్నావేమిటి?" అని రెండుగట్టిగా చరిచిందివీపుమీద. సువర్ణ ఏడిచింది. నాన్నగారదివిని "ఏమిటి దాన్నట్లా బాదిచంపుతూన్నావు" అంటూ లోపలికొచ్చేరు.

"చూశారా? మీ పెంచటం. మంగళసూత్రాన్ని కాస్తా వూడదీసి అక్కడ పెట్టింది."

"దానికేం తెలుసు పాపం."

"ఇంకా యెట్లాచచ్చేది? చెప్పితేచెప్పుతున్నావు అంటిరి. చెప్పకపోతే తెలియదాయెనంటిరి. చెప్పకపోతే యెట్లా తెలుస్తుంది. రేపు మరోలాగా గుండు చేయించుకు తిరుగుతాననంటుంది. ఎందుకొచ్చింది. మెల్లిగా దాన్ని కిరస్తానల్లో కలిపితేగాని మీకునిద్దర పట్టదు. ఇదీ ఒక పెంపకమేట?"

"నువ్వు అక్కడికి విరమించు. నేను చెప్పతాన్లే చెప్పాలిసినవిధాన. అయినకాడికి బాదితే తెలుస్తాయా యివ్వి?"

సువర్ణని ఓదార్చి తనతో షికారుతీసుకునివెళ్ళేరు డిఫ్యూటీకలెక్టరుగారు. త్రోవలో అదివామూలుదండగాడనీ, ఆంజనేయుని బిళ్ళలాంటిదనీ, అది మెళ్ళో ఉన్నంతకాలం తననేయితరగ్రహంఆవేశించవెలుస్తుందనీ నచ్చచెప్పేరు. అంతగాభయం అయితే బంట్రోతుని వెంటబెట్టి పంపుతాను బడికన్నారు.

౪

సువర్ణకి బావ చదువుచెప్పేందుకుకాలం సాయంత్రం. "సాయంకాలంగూడా యేంచదువు? ఆడుకోనన్నా నివ్వరుదాన్ని పాపం. ఇట్లా అయితే పిల్ల యెల్లాకోలుకుంటుంది?" అంటూ తన అయిష్టాన్ని సూచిస్తూవుండేది సువర్ణనాయినమ్మ. నాన్నగారు గూడా అవునంటూండేవారు కాని సువర్ణ బావదగ్గిర చదువుకోటంతో ఆడుకోనిలోపం పట్టివ్వటంలేదని ఊరుకున్నారు. ఇఘ వాళ్ళచదువు బహుతమాషాగా వుంటుంది. అత్తగారడుగుతూండేది అప్పుడప్పుడు "బాగాచదువుతోందా? చదువు ఏమన్నావొస్తోందా దానికి?" అని. "ఆ వొస్తూనేవుంది. పాఠాలు కొలత లేకుండా జరుగుతున్నాయి" అనేవాడు.

బావే నవ్వుకుంటూండేవాడు. "దాదాపు రెండు సంవత్సరాలవుతోంది సువర్ణకి చదువుచెప్పటం మొదలుపెట్టి. ఏపుస్తకంలోనన్నాగాని షట్టుమని పదిపేజీలన్నా నడవలేదు. బలేచదువు" అని.

సువర్ణకి మొగుడూపెళ్ళాం ఇట్లాంటి మాటలు వినటం అసహ్యంగావుండేది. ఏపుస్తకంలోనన్నా యివ్వి తటస్థించాయా ఇహ ఆపుస్తకం అక్కడికాఖరు. సాధారణంగా అన్నిపుస్తకాల్లోనూ వుంటాయియివ్వి. అందుకనే బావకి వారంరోజులు పట్టింది సువర్ణకోసం పెళ్లిమాటలులేని ఒక్కమంచి పుస్తకంఏరేటందుకు.

ఆపుస్తకాలుతెచ్చి చదివించేవాడు. ఒకకథలో ఒకబీదముసలిది. రాత్రివేళ చలితోవొణుకుతోంది. అదిచూసి ఒకకుఱ్ఱాడు ఆముసలిదాన్ని ఇంట్లోకితీసుకువెళ్ళి దానికాళ్లు కడిగి, తుడిచి, అన్నం పెట్టించి పడుకోజేశాడు. అది చదివినవ్వింది సువర్ణ అదేమిటా అబ్బాయి అడుక్కుతినేదానికాళ్లు పట్టుకోడం అని. బావకానవ్వు అర్థమైంది. "నవ్వుతావేం? బీదదిచలిలో చచ్చిపోకుండా కాపాడేడు. మనంగూడా అట్లాగే చెయ్యొచ్చు. చెయ్యొచ్చేమిటి చెయ్యాలి. ఎవరన్నా దిక్కుతెలియక పోతూవుంటే మనం వాళ్ళనాదరించాలి—" అని ఇంకా యేమిటో చెప్పబోతూంటే మధ్యే, మొన్ననే, ఎవరోఅబ్బాయే, పాపం అయిదేళ్లుంటాయి, తప్పిపోయి యేడుస్తూ మాయింటిముందర నించిపోతూంటేను—"

"లోపలికిఎత్తుకొచ్చి అన్నం పెట్టించేవా?"

"ఛీ"

"ఛీ! ఛీ యేమిటి. అట్లాంటప్పుడు, మత్తి, ఆఅబ్బాయి నల్లా వొదిలేస్తే ఏబళ్ళకిందన్నాపడితే."

ఇట్లాగేయేదో ఒకమాటమీద చిన్నచిన్న వుపన్యాసాలిస్తూండేవాడు. వీటితో చదువుసాగేదిగాదు. ఈవుపన్యాసాలనే పాఠాలని వాడుతూండేవాడు.

... ...

ఏదోఒక సందర్భంలో ఒకరోజున "మంచిస్నేహితులు కావాలిసొస్తే ఒకళ్ళకోసం వొకళ్ళు తమ

ప్రాణాలుగూడా అర్పించుకుంటారు ఏపనినైనాసరే ప్రేమవల్ల చెయ్యగలుగుతారు" అని చెప్పేడు.

"ప్రేమఅంటే"

"చెప్పుతా—నాకు కాసిని మంచినీళ్ళు తెచ్చి పెడతావ్."

సువర్ణ వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి అక్కడ పెట్టింది.

బావ నీళ్ళుతాగలే.

"తాగూ"

"ఆ, తాగుతా... ఈనీళ్లెందుకు తెచ్చావ్?"

"నువ్వు తెమ్మన్నావుగా."

"ఐతేమట్టుకు ఎందుకు తేవాలి. తేకపోతే యేం యింతలోనే?"

"మరినీకు కావాలిగా మంచినీళ్లు."

"ప్రేమంటేఅదే. నేను చెప్పినపనిని చెయ్యకుండా వుండనియ్యనిది అదే ప్రేమ."

. . . .

తరవాత రెండురోజులకి. చదువుకుంటూ చదువు కుంటూ "నేను రేపునాయనమ్మతో వూరికెడుతాను. మూడురోజులదాకా రాను" అంది.

"వెళ్ళకపోతే యేం?"

"ఐతే వెళ్ళొద్దంటావా"

"ఊఁ" అనివూరికేనే, నవ్వుతూ అన్నాడు.

"వెళ్ళనులే"

"పాపం, ఏం, ఇంతలోనే మార్చుకున్నావు?"

"వూరికేనే"

"అంటే?"

"ఆహా, కాదూ, మరీమొన్న నువ్వు చెప్పావులా అంచాత."

"అర్థంకాలా"

"ప్రేమచేత"

"పోనీలే వెళ్ళు"

"నిజంగాఅంటే వెడతాను."

"నిజంగా"

"సరే ఐతేవెడతా"

అవును. ప్రేమచేతేసువర్ణ వూరికెళ్ళననగలిగింది. ప్రేమచేతే నిజంగా వెళ్ళమంటే వెడతానన్నది. లోకంలో అమలులోవుండేఅర్థంకాదిక్కడప్రేమకి.

డిప్యూటీకలెక్టరుగారు వీళ్ళిద్దరికి స్నేహాన్ని కలప దలుచుకున్నారు. ఆవుద్దేశ్యం యిట్లా నెరవేరింది.

బావకావూళ్ళో చదువైపోయింది. ఎఫ్. ఎ. కి చెన్నపట్నం వెళ్ళేడు. సువర్ణకేమీతోచేదిగాదు బాగా అలవాటైన బావతోటి చదువు మానవలసి నప్పటినుంచి యేమిటో కొత్తగావుండేది. ఆడుకో డానికి వుత్సాహంవుండదు. చదువుకోడానికి యిష్టం వుండదు.

. . . .

ఒకరోజున డిప్యూటీకలెక్టరుగారు భార్యతో అన్నారు "మన సువర్ణని అడయార్ పంపుదాం"అని.

"అడయార్ పంపినాసరే యేయేట్లోదింపినాసరే. ముందేచెప్పేనుగా కిరస్తానల్లో కలపమని. అంతే. నాకెందుకివన్నీ. పిల్లనడవడంతా పాడవాలంటే అట్లా చెయ్యండి."

"అదిగాదు. అక్కడికెడితే వాళ్ళచదువూ ఆటలూ పాటలూ ఆధోరణేగాని ఇహ యీ మొగుడూపెళ్ళాం ఈగోడేమీవుండదు. ఒక్కనాలుగైదేళ్ళుంచితే చాలు. గుణాలకిస్థిరత యేర్పడుతుంది."

"ఈపెటకంయెవళ్ళు పెట్టారుబాబూ. ఇదివర కెప్పుడూలేవే యీవుద్దేశ్యాలు."

"పెటకంయేమిటి నీతలకాయ. ఒకళ్ళు చెప్పేదే ముంది యిందులో. బుద్ధిమాంద్యం వొదులుతూంటే అవ్వే స్ఫురిస్తాయి."

. . . .

అడయారులో డిప్యూటీకలెక్టరుగారు తలచినట్లు మొగుడూపెళ్ళాం ఇట్లాంటివి వినబడవు. కాని ఆవాతావరణంలోవుంటే అన్నిటి నిజరూపాలూ తెలుస్తాయి. ఒకరుచెప్పనక్కర్లేదు.

సువర్ణకి పదిహేనేళ్ళొచ్చాయి. జగత్తుయొక్క అస్థిత్వానికిప్రేమేమూలాధారం అనేపద్ధతిపిల్ల అయింది

సువర్ణ. మనసారస్వతంలో భద్రములై వున్న సావిత్రీ మొదలైన పతివ్రతలజీవితాలు బాగాచదువుకుంది. అందరూ చదువుకున్నట్టుగాదు. సావిత్రియొక్క పాతివ్రత్యాన్ని బాగా అర్థంచేసుకుంది. అంటే ప్రేమ సర్వంజయిఅని. ఈవిశ్వాసం సువర్ణహృదయంలో బాగానాటుకుంది.

. . . .

సువర్ణ నిర్మలప్రేమనుగూర్చి వ్యాసాలువ్రాసేది. స్కూలులో చిన్నచిన్న ఉపన్యాసాలుగూడా యిచ్చేది. "లోకం 'పెళ్లి' అన్నదాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. అర్థంతెలుసుకుంటే మరి ఆ'పెళ్ళి' అన్నమాటని మనం మామూలుగావాడుకుంటూన్నట్టు చవకగావాడలేం. దాన్ని అనవసరంగా అర్థంలేకుండా వాడటంఅంటే భయంవేస్తుంది గొప్పతప్పిదం చేస్తున్నాంఅని. ఎంతమందో స్నేహితులుంటారు. అందరి పేర్లూ మనకి తెలియవు. హృదయాలు రెండుకలసిన స్నేహితులకి ఒకరిపేరుతో వొకరికి అవసరంవుండదు. వ్యక్తికిప్రాధాన్యం. పేరుకి అదిలేదు. పెళ్ళిఅంటే ఒకళ్ళకొకళ్ళు కావలిస్తే బలియిచ్చుకోగల ఎన్నటికీ విరగని స్నేహసంబంధం. ఇట్లాంటి ప్రేమసంబంధం లోకవిదితం చెయ్యటానికిపెట్టింది పెళ్లిఅన్నఆచారం. కాని యీఆచారసంబంధి అయిన కర్మకాండమూలాన యేర్పడేదికాదు ఆఅవిచ్ఛిన్నసంబంధం. ఒకరికొకరు అప్రయత్నంగానే పెళ్ళైయిపోతారు. ఆ'కర్మ'కాదు పెళ్ళిచేసేది"అని చెప్పిం దొకసారి స్కూలులో.

అప్పుడు ఎవరో అన్నారు "అట్లాంటిప్రేమ ఇప్పుడున్నదా?"అని. దానికి చమత్కారంగా జవాబు చెప్పింది. "పూర్వంవుండేది. ఇపుడులేదు. దాన్ని దేవతలు ఎత్తుకుపోయారు. 'మీరుచెడి రాక్షసతుల్యు లవుతున్నారు. జీవనాధారం అయినప్రేమని మీకు దొరకనిస్తే రాక్షసులకిఅమృతందొరకనిచ్చినట్టు"అని.

౬

ఎండాకాలంశెలవులు రాబోతున్నాయ్. అంటే ఫిబ్రవరిలో అన్నమాట. డిప్యూటీకలెక్టరుగారు, కూతురూ అల్లుడూరాగానే కార్యంతలపెట్టి తత్ప్రయత్నంలోవున్నారు.

. . . .

సువర్ణ పదిహేనురోజుల్లో వొస్తుంది. హడావిడిగావున్నారు డిప్యూటీకలెక్టరుగారు, తుదిరంగం యెట్లాఆడించడమూఅని. సువర్ణకి తెలిసినా బావతన భర్తఅని, తాను వాళ్ళిద్దరినికూర్చి తెలియచెప్పి మంగళహారతితో తన సమర్థింపునాటకం ముగించి తెరదింపించుదాం అనుకున్నారు.

. . . .

ఒకరోజున సువర్ణదగ్గరనించి ఒకకవరువచ్చింది. వస్తున్నానని వ్రాసింది కామల్లునని కవరు చించేరు. అందులో ఒక ఇన్విటేషన్‌కార్డుంది. నిర్విణ్ణుడైనాడు. మొహం కళాహీనంఅయింది.

"సువర్ణకి, ఆర్. రామన్‌కి 25-వ తారీఖున (అంటేరేపే) అడయారులో పెళ్ళిట"అన్నారు తల వంచి పెళ్ళాంతో.

"ఏంది! అనుకున్నంతా అయింది"అని గొల్లున యేడుస్తూ భర్తని ఆగకతిట్ట మొదలుపెట్టింది.

పాపం ఆయనేంచేస్తారు. మొహంయింతైపోయింది.

. . . .

నలుగురు పెద్దమనుష్యుల్ని తీసుకుని మద్రాసు చేరేరు. వెంటనే మోటారులో అడయారు వెళ్ళేరు.

"శ్రుతిమించింది. రాగంకూడా అలవడ్డది. సువర్ణని మందలించడంకన్నా ఆరామన్ నెవరినో బతిమాలుకుంటే మంచిది"అని అందరు నిశ్చయించుకున్నారు.

రామన్ అన్న ఆయనవుండే యింటికోసం భోగట్టా చేశారు. ఆయింట్లోకి వెళ్ళేరు. లోపల బావకనిపించేడు. "ఏం?రమణాయిక్కడున్నావు?"

"సువర్ణపెళ్ళికివచ్చేం. మీరూ అందుకేనాఏమిటి? ఇదేమనకివిడిది. పెళ్ళికూతురిగారిల్లు కొంచందూరాన వేవుంది."

"అయితే రామన్ ముండాకొడుకేడీ? నీవిట్లా దద్దమ్మలాగు కూర్చున్నావేం నీదార నింకోడికిస్తూ."

"ఉండండి మామగారూ! ఇప్పుడేవస్తా. పెళ్ళి కూతురు బయల్దేరినట్టుంది మేళాలు వినపడుతున్నాయి ముహూర్తందగ్గిరకొచ్చింది" అని లోపలికి వెళ్ళుతాడు.

"ఇంకా మామగారేమిటి? మొగతనం లేనిద్విపాద పశువా!"

... ...

వాకిట్లో మేళాలు సమీపిస్తున్న అలజడి వినపడుతుంది. వీళ్ళంతా బయటికి పరుగునవచ్చేరు. ఊరేగింపు వాకిట్లోఆగింది. చుట్టూతా అక్కడి ఆడపిల్లలు నడుస్తూంటే సువర్ణ ఖద్దరుచీరగట్టి శృంగారించుకుని చేతులో పూలమాలతో ఇల్లుప్రవేశించింది. నాన్నా వాళ్ళూ దిక్కుతోచక చిత్రప్రతిమలలాగునుంచుని పోయారు. లోపల ఖద్దరుధారియై పెళ్ళికొడుకు పెళ్లికూతుర్ని ఎదుర్కున్నాడు. ఒకరిమెళ్ళో ఒకరు దండలువేసుకున్నారు. "ఆనాటి పెళ్ళిమీకర్థం అయింది, యీనాటిపెళ్ళి మాకర్థంఅయింది" అన్నది సువర్ణ. నాన్నా అందరు దంపతుల నాశీర్వదించేరు. పెళ్ళికొడుకుబావే. "సువర్ణా! ఈసంగతి తెలిస్తే మన వాళ్ళనందరినీ తీసుకునొచ్చేవాణ్ణిగా. వాళ్ళూ ఆనందించేవాళ్లు."

"మించిందేముంది. మనవూళ్లో తృతీయంవివాహం చేసుకుంటాం."

నిశ్రేణి

సహదేవ సూర్యప్రకాశరావుగారు

ఈధనుర్మాససౌభాగ్య మేమియేమి
ఇంతజీర్ణించుకొన్న నాహృదయమిపుడు
ప్రమానుపడ్డది మధురసంధ్యానిలంపు
శీకరమ్ములనేని హాసింపకుండ.
ప్రకృతికాంతిల్లి మకరశోభనల పుచ్చ
పువ్వు లేతవెన్నెలల నవ్వుకొని ముద్ద
బంతిచేమంతిబంతుల పరువుచూచి
మోమువాంచి సుధాంత్రపామూర్తియాయె.
ఎవరులేరేమినాకు నేనేవిముక్త
విరహాసుషిరాన మ్రోసిన తరళనయన
పాళికామధుమాలికాపదములోలయు
అసురసంజలో గొంతెత్తి అవసిపోతి.
మూగచెరవీడి ఎప్పుడు ప్రొద్దువోవు?
ఇన్నినల్లనికన్నులు నన్నుచూచు
తెప్పవాల్పవు గ్రుడ్డులు త్రిప్పుకొనవు
వెఱచిపోదునేమోయన్న బెదరులేదు.
ఆశతో రాగసూత్రమ్ము లల్లుకొనుచు
మొక్కవోయినలోకమ్ము పొంతబోక
తూర్పురేకలో నిట్టిట్టె త్రుళ్ళిపడుచు
కడలుబ్రాకగా నిశ్రేణి గట్టికొందు.

—'వకుళమాల' నుండి.

వటపత్రశాయి

శ్రీమతి పోతాప్రగడ రాజరత్నమ్మగారు

వటపత్రశాయివై వనజేక్షణా! నీవు
అబ్ధిలోదేల కారణమదేమొ
ఆదిమహాలక్ష్మి హృదయసీమనుబాసి
యబ్ధిలోదేల కారణమదేమొ
భక్తవరదుండవు భక్తులబోద్రోలి
యబ్ధిలోదేల కారణమదేమొ
జగములబోషించి సక్కజేయుటమాని
యబ్ధిలోదేల కారణమదేమొ
ఆశ్రితులరోసి, యర్థాంగినవలదిగిచి
శంఖచక్రంబులన్ ద్రోచి జగముమఱచి
యొంటి వటపత్రశాయివై యోగనిద్ర
యొడలుదెలియకయుంటకుయొద్దికతమొ?